క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేత



రాజంపేట: తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం గ్రీన్‌కో సోలార్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ గల క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఏజీఎం ఏసుబాబు, ఎస్‌జీ భాషా, డీఎం సత్యనారాయణ మాట్లాడారు. ఐదేళ్ల నుంచి పాఠశాలకు స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవాలకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకొని వాలీబాల్, కబడ్డీ వంటి ఆటల్లో రాణించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు దొమ్మటి భిక్షపతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం

కామారెడ్డి: నిర్మల్ జిల్లా దిల్‌వార్‌పూర్ వద్ద ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఉద్యమానికి అండగా నిలిచిన ఉపాధ్యాయుడు, నిర్మల్ జిల్లా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం, అన్యాయమని తెలంగాణ పీపుల్ జేఏసీ నాయకులు కె.రమణ, కె.వేణుగోపాల్, న్యాయవాదులు జి.జగన్నాథం, వీఎల్. నర్సింహారెడ్డిలు ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన ప్రజాస్వామ్యం ఇదేనా అని వారు ప్రశ్నించారు. సస్పెన్షన్‌ను ఎత్తివేసి ప్రజాస్వామ్య ఉద్యమాలను గౌరవించాలని కోరారు.

సమగ్ర సర్వేలో చాకలి వారు ధోబీ అని రాయించాలి

కామారెడ్డి అర్బన్: సమగ ఇంటింటి కుటుంబ సర్వేలో చాకలి, రజక, ధోబీ కులస్తులు పార్ట్‌–1లో 7వ లైన్‌లో కులం పేరు, 8వ లైన్‌లో ఒక దాంట్లో రజక, మిగతా వాటిలో ధోబీ అని రాయించాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర యువత కార్యదర్శి దేవరి నందు ఒక ప్రకటనలో కోరారు. ధోబీ అని రాయించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర గెజిట్ ప్రకారం భవిష్యత్తులో ఎస్సీగా హోదా వస్తుందన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ధోబీలు ఎస్సీలుగా ఉన్నారని పేర్కొన్నారు.

హేతుబద్ధంగా ఆలోచించాలి



మాచారెడ్డి: ఎవరో ఏదో చెప్పారని గుడ్డిగా నమ్మకుండా హేతుబద్ధంగా ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ గంగరాజు అన్నారు. గురువారం సోమారంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢత్వాన్ని పక్కన పెట్టి సైన్సును నమ్మాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుర భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికవరీ సెల్‌ఫోన్ల అప్పగింత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెనెమ్లి చెందిన నవీన్‌రెడ్డి, ఆర్మూర్ చెందిన పండరి ఫోన్లు ఇటీవల పోయాయి. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఫోన్లను రికవరీ చేసి గురువారం వారికి అప్పగించినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు.

మాజీ ఆదర్శ రైతుల సమస్యలు పరిష్కరించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మాజీ ఆదర్శ రైతులను ప్రభుత్వం తిరిగి తీసుకొని తమ సమస్యలను తీర్చాలని మాజీ ఆదర్శ రైతులు కోరారు. తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న హైదరాబాద్‌లో మాజీ ఆదర్శ రైతుల సమావేశం ఉంటుందన్నారు. గ్రామాలలో ఉన్న మాజీ ఆదర్శ రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. సంజీవరెడ్డి, విఠల్, సూర్యకాంత్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, మధు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎంపీడీవోగా ప్రకాష్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంపీడీవోగా ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఎంపీడీవోగా ఉన్న లక్ష్మీని జిల్లా పరిషత్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపడంతో ఆమె స్థానంలో ఎంపీవోగా ఉన్న ప్రకాష్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ప్రకాష్‌కు ఏపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

రోడ్డు బాగాలేక..లారీలు రాక..!

- లింగంపల్లికలాన్‌లోని కొనుగోలు కేంద్రంలో నిలిచిన ధాన్యం కాంటా
- రైస్‌మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 17 వందల బస్తాలు



కొనుగోలు కేంద్రంలో తూకం చేసి రైస్‌మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు



కుంగిన లింగంపల్లికలాన్ రోడ్డు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఒకవైపు ఆదేశిస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా లింగంపల్లికలాన్ గ్రామంలో ధాన్యం బస్తాలను తరలించడంలో జాప్యం జరుగుతోంది. గ్రామానికి వెళ్లే రోడ్డు లారీల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడమే ఇందుకు కారణం. గ్రామానికి లారీలు రావడంలేదనే కారణంతో గురువారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి తమ గ్రామానికి వచ్చే రోడ్డు కుంగిపోయిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలు రావడంలేదని గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. తూకం వేసిన బస్తాలను రైస్‌మిల్లుకు తరలించకుండా రోజుల తరబడి కొనుగోలుకేంద్రంలోనే ఉంచడం వల్ల ధాన్యం బస్తాల బరువు తగ్గే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంగిన రోడ్డును బాగుచేయాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన రావడంలేదని వారు పేర్కొన్నారు. అధికారుల తీరుతో నీరసించిన రైతులు కుంగిన రోడ్డును తాత్కాలికంగా బాగుచేసుకునేందుకు గ్రామానికి చెందిన రైతులు గురువారం సమావేశమయ్యారు.

రోడ్డు బాగాలేదు

మెయిన్‌రోడ్డు నుండి మా ఊరికి వచ్చే రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి కుంగిపోయింది. దీంతో లారీలు వచ్చి పోయేందుకు ఆటంకం ఏర్పడింది. లారీలు రాకపోవడం వల్ల కొనుగోలు కేంద్రంలో వడ్ల సంచులు పేరుకుపోయాయి. వర్షం కురిస్తే వడ్ల సంచులు ఎక్కడ తడిసిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. రోడ్డును బాగుచేసి మా ఊరికి లారీలు వచ్చేలా చూడాలి. – రొడ్డ గోపాల్, రైతు, లింగంపల్లికలాన్

లారీలను పంపుతాం

లింగంపల్లికలాన్ గ్రామానికి వెళ్లే రోడ్డు బాగాలేకపోవడం వల్ల లారీలను తీసుకువచ్చేందుకు డ్రైవర్లు సిద్ధంగా లేరు. లారీడ్రైవర్లకు నచ్చచెప్పి గ్రామానికి లారీలను పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. తూకం సిన ధాన్యం స్తాలను రైస్‌మిల్లుకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. – సందీప్, సొసైటీ సీఈవో, మాల్తుమ్మెద

కాంటా చేసి మూడు రోజులు

నా వడ్లు కాంటా చేసి మూడు రోజులవుతోంది. వడ్ల సంచులు కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నాయి. వడ్లసంచులు ఎప్పుడు పోతాయోనని కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న. పెద్ద సార్లు స్పందించి మా ఊరికి లారీలు వచ్చేలా చూడాలి. – బ్యాగరి కిష్టయ్య, రైతు, లింగంపల్లికలాన్

కొనసాగుతున్న సమగ్ర సర్వే



ధర్మారెడ్డిలో స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేందర్



జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో సర్వే స్టిక్కర్లు అతికిస్తున్న అధికారులు



గాంధారిలో.. ఎంపీడీవో రాజేశ్వర్



తాడ్వాయిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతోంది. గురువారం ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికించారు. కుటుంబ సభ్యులు అందరూ నిర్దేశిత తేదీల్లో అందుబాటులో ఉండాలని ఇంటి యజమానులకు సూచించారు. అన్ని రకాల ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అలాగే పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే తీరును పర్యవేక్షించారు.



బాన్సువాడ పట్టణంలోని 12వ వార్డులో..



లింగంపేటలో.. ఎంపీడీవో నరేష్



సోపూర్‌లో.. ఎంపీడీవో శ్రీనివాస్



రాజంపేటలో .. ఎంపీడీవో రాజేశం



బీబీపేటలో.. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

ధూమపానం నియంత్రణపై అవగాహన



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామ శివారులో గల గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం ధూమపానం నియంత్రణపై అవగాహన కల్పించారు. యుక్త వయస్సులో విద్యార్థులు ధూమపానానికి దూరంగా ఉండాలని దేవునిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జోహ ముజీబ్ సూచించారు.

బంజారా భాషను గోర్ బోలిగా నమోదు చేయాలి



రాజంపేట: లంబాడీలు బంజారా భాషను గోర్ బోలిగా నమోదు చేసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్ ఓ ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో బంజారా భాష మాట్లాడే ప్రతి బంజారా తమ మాతృభాష తెలుగు కాకుండా గోర్ బాలీగా నమోదు చేసుకోవాలని సూచించారు. గోర్ బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి తీర్మానం పంపియ్యడానికి ఈ సర్వే తోడ్పడుతుందని పేర్కొన్నారు.

పోరాడి విజయం సాధించాలి



దోమకొండ: జీవితంలో ప్రతి ఒక్కరు పోరాడి విజయం సాధించాలని, నలుగురికి ఆదర్శంగా నిలబడాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, స్పీకర్ రమేశ్ చైతన్య అన్నారు. గురువారం దోమకొండ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు జీవిత లక్ష్యాలు– సవాళ్లు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సమస్యలు ప్రతి ఒక్కరికి ఉంటాయని వాటిని మనం ఎలా స్వీకరిస్తామనే అంశంపై విషయం ఆధారపడి ఉంటుందన్నారు. భయపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జీవన భృతి చెల్లించాలి



మాట్లాడుతున్న బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు

రాజంపేట: బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4016ల జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాజంపేట మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలపై తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఒక్కరి జీవన భృతి ఇవ్వాలని, లేకుంటే స్థానిక ఎన్నికలలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నాయకులు నాంపల్లి, భాస్కర్, పంచాక్షరి, బాల్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు మేలు



స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి సలాం

బాన్సువాడ : ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా నోడల్ అధికారి సలాం అన్నారు. గురువారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్ విద్య చాలా కీలకమని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి వెళ్లాలంటే ఇంటర్ విద్యనే పునాదని అన్నారు. ఇంటర్‌లో కష్టపడితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శివకుమార్‌ను ఆయన అభినందించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎజాస్, దాసరి శ్రీనివాస్, అధ్యాపకులు ఉన్నారు.

గ్రంథాలయాలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్



భిక్కనూరు: పాఠకులకు సౌకర్యాలు కల్పించి గ్రంథాలయాలను తీర్చిదిద్దుదామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్ అన్నారు. గురువారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం అందరం కల్సి సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలోనే కలుస్తామన్నారు. గ్రంథాలయాలను ఆదర్శ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లమ్మతండాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గురువారం డీఈఈ గిరి పరిశీలించారు. ఈ సందర్భంగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏఏ వసతులు అవసరం ఉన్నాయో వాటికి ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టరుకు అందజేస్తామన్నారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి, తండా వాసులు ఉన్నారు.

బల్దియా కార్యాలయంలో నేడు మెగా వైద్య శిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్/కామారెడ్డిఅర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో కామారెడ్డి మున్సిపల్, జిల్లా రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ల ఆధ్వర్యంలో నేడు మున్సిపల్ కార్యాలయంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. గురువారం కార్యలయంలో శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రక్తదాతలు ఈ శిబిరానికి తరలివచ్చి పెద్ద సంఖ్యలో రక్తదానం చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు 9492874006ను సంప్రదించాలని కోరారు. రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేదప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి



మాచారెడ్డి: ఎస్సీ వర్గీకరణ కోసం మాలలు సహకరించాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు బట్టు రమేశ్ కోరారు. గురువారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడారు. వర్గీకరణకు 30 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషి ఫలించిందన్నారు. వర్గీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట్ రాములు, పొదర్ల రవి, గడ్డం బాబు, జాన్, రామచంద్రం, విజయ్ కుమార్, లక్ష్మణ్ ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): బాలల హక్కులపై లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు మోహన్, సూర్యప్రకాష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులను చైతన్యపర్చి స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలన్నారు. నా హక్కు నా స్వరం అనే అంశంపై అవగాహన కల్పించారు. పిల్లలలో ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ప్రోత్సహించాలన్నారు.

'ఆలయ అభివృద్ధికి సహకరిస్తా'



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రామారెడ్డి: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాలభైరవుడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తెలిపినట్లు కాలభైరవ స్వామి ఆలయ ఈవో ప్రభుగుప్తా పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే కాలభైరవుడి జయంతి ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు ఈవో ప్రభు గుప్తా, అర్చకుడు శ్రీనివాస శర్మ అందజేశారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే చెప్పినట్లుగా వారు పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈవో దేవేందర్ రావు

మాచారెడ్డి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రమాణాలను పెంచాలని మాచారెడ్డి ఎంఈవో సురభి దేవేందర్ రావు సూచించారు. గురువారం లచ్చాపేట ప్రాథమిక, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించినప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు ఎఫ్‌ఆర్‌ఎస్, ఎండీఎంకు సంబంధించిన సమాచారాన్ని ఆన్లైన్ చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, సీఆర్పీ నరేష్ తదితరులున్నారు.

సంక్షిప్తం

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



రామారెడ్డి: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని రామారెడ్డి ఏఎస్సై రవీందర్ సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. గురువారం రామారెడ్డిలో వాహనాల తనిఖీ చేపట్టారు. కానిస్టేబుళ్లు పవన్, సాయిలు పాల్గొన్నారు.

నూతన రేషన్ షాపు ప్రారంభం



కామారెడ్డి రూరల్: చిన్న మల్లారెడ్డిలో ఏలూరి శేఖర్‌కు నూతనంగా మంజూరైన రేషన్ షాపును గురువారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమయానుకూలంగా రేషన్ షాపు నడపాలని సూచించారు. కమ్మరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గంగాధర్‌రావు, ఆసం శ్రీనివాస్, కమ్మరి లక్ష్మీనారాయణ, కమ్మరి నవీన్, ఏలూరి శంకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం వ్యవసాయ విస్తర్ణ అధికారి వీణ పరిశీలించారు. రైతులు ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. రైతులు దళరులకు అమ్మి మోసపొవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని సూచించారు.

చిన్నమల్లారెడ్డి, కోటాల్‌పల్లి గ్రామాల్లో..



కామారెడ్డి రూరల్: చిన్న మల్లారెడ్డి, కోటాల్‌పల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని సేకరిస్తున్న విధానాన్ని అక్కడున్న సెంటర్ ఇన్‌చార్జీని అడిగారు. అధికారులు, లారీ యాజమానులకు పలు సూచనలు చేశారు.

శాంతాపూర్, బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శాంతాపూర్, బిచ్కుంద వరి కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ సురేష్ పరిశీలించారు. ఎన్ని క్వింటాలు తూక వేశారు.. ఎన్ని బస్తాలు రైస్ మిల్లులకు తరలించారు తదితర వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెంచాలని సూచించారు. ఏదైన సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ నిర్వాహకులను సూచించారు. ఆర్‌ఐ రవీందర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాచారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో డైరెక్టర్ బుచ్చిరెడ్డి సూచించారు. గురువారం అక్కాపూర్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.